# సమీకృత మార్కెట్ సిద్ధం



వేములవాడ : వేములవాడ పట్టణ ప్రజలు, కూరగాయల రైతులకు కష్టాలు తీరనున్నాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ముందు శామకుంటలో ఆధునిక హంగులతో కూరగాయల విక్రయాలకు మార్కెట్‌ను నిర్మించారు. దీంతో వేములవాడ పట్టణంలో రోడ్ల వెంబడి క్రయ, విక్రయదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. శామకుంటలో రూ. 2.7 కోట్ల మున్సిపల్ నిధులతో అధునాతన వసతులతో సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ పూర్తయింది. ఈ పనులకు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గత ఏడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. పట్టణంలో ఇప్పటి వరకు సరైన కూరగాయల మార్కెట్ లేక పట్టణవాసులు, కూరగాయల వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తొలగించేందుకు స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో శామకుంట, మార్కెట్ యార్డులో రెండు మార్కెట్ల నిర్మాణానికి సంకల్పించారు. పట్టణానికి వేములవాడ పట్టణ చుట్టు పక్కల గ్రామాలతో పాటు బోయినపల్లి, కోనరావుపేట, చందుర్తి తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చే రైతులకు సైతం సరైన మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద, రెండో బైపాస్ రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద కూరగాయల మార్కెట్లను రహదారుల పక్కన నిర్వహిస్తున్నారు. ఇలా కూరగాయల మార్కెట్‌కు సరైన స్థలం లేక రైతులు, విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఈ మార్కెట్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. శామకుంటలో రూపుదిద్దుకున్న సమీకృత కూరగాయల మార్కెట్‌తో రోడ్లపై క్రయ, విక్రయదారుల సమస్యలు పూర్తిగా తొలగనున్నాయి. పట్టణంలోని శామకుంటలో సమీకృత కూరగాయల మార్కెట్‌ను సకల సౌకర్యాలతో అధునాతనంగా నిర్మించారు. కూరగాయలకు సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్‌లో 51 స్టాల్స్, పైఅంతస్తులో 51 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కూరగాయలతో పాటు పండ్ల విక్రయాలకు అవకాశం కల్పిస్తారు. మొదటి అంతస్తులో కూరగాయలు, పండ్లు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజ్‌ను నిర్మించారు. రైతులు, విక్రయదారులు, వినియోగదారులకు సకల వసతులు ఉండే విధంగా తీర్చిదిద్దారు. అన్ని రకాల కూరగాయలు, పండ్లు ఇందులో లభించేలా స్టాల్స్ ఉంటాయి. దీంతో పట్టణ ప్రజలకు ఇది బాగా ఉపయోగపడనున్నది.


## ప్రాణాలకు రక్షణ ఏదీ?-

# రహదారి పక్కనే బావులు



కరీంనగర్: ఆర్నెల్ల కిందట తిమ్మాపూర్ నుంచి చిగురుమామిడి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న బావిలోకి కారు దూసుకెళ్లిన ప్రమాదంలో వాహనాన్ని నడుపుతున్న విశ్రాంత ఎస్సై మృతి చెందారు. భూ ఉపరితలానికి సమాంతరంగా నీళ్లున్న బావిలో పడటంతో 30 అడుగుల లోతుకు కారు చేరుకుంది. నీళ్లను తోడి బయటకు తీసేందుకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది 10 గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. దాదాపు ఏడేళ్ల కిందట సైదాపూర్ మండలం దుద్దెనపల్లి వద్ద కొత్త ట్రాక్టర్ బావిలో పడి నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. మూడేళ్ల కిందట హుజూరాబాద్ మండలం సింగాపూర్ వద్ద కారు బావిలో పడి తాత, మనవడు మృతి చెందారు. అడపాదడపా ఉమ్మడి జిల్లాలో ద్విచక్ర వాహనదారులు కూడా బావుల్లో పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. సాగునీటి కాలువలు, చెరువులు ఎక్కువగా ఉన్న జిల్లా కావడంతో ప్రమాదకరంగా ఉన్నచోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతోపాటు తీవ్రతను బట్టి ప్రహరీలను నిర్మించాలనే నిర్ణయాలు ఆచరణకు నోచుకోవడం లేదు. ఏడేళ్ల కిందట సైదాపూర్ మండలంలో వ్యవసాయ పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్న రైతు కూలీలు రోడ్డు పక్కనే ఉన్న బావిలో పడిపోయి మృత్యువాత పడినప్పుడే జిల్లాలో ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా పాలనాధికారి, పోలీసు ఉన్నతాధికారి, రవాణాశాఖ ఉన్నతాధికారి, ఇంజినీరింగ్ అధికారులతో బావులను గుర్తించి వాటి వద్ద శాశ్వత భద్రత కల్పించేలా ప్రణాళికల్ని సిద్ధం చేయాలని భావించారు. ఎక్కడికక్కడే క్షేత్రస్థాయిలో లెక్కలు గట్టి అప్పటి ఉమ్మడి జిల్లాలోనే దాదాపుగా 2వేల చోట్ల బావులున్నాయని గుర్తించారు. ఇందులో రోడ్డుకు అత్యంత దగ్గరలో.. కొంచెం దూరం అని కేటగిరీలు కూడా చేశారు. వీటి వద్ద రక్షణగా ప్రహరీల నిర్మాణానికి నిధుల్ని అంచనా వేశారు. తరవాత ప్రతిపాదనల్ని పంపగా.. కొన్నిచోట్ల మాత్రమే నిర్మించారు. మానకొండూర్ నుంచి అన్నారం వెళ్లే దారిలో 30 అడుగుల లోతున్న ఈ పెద్ద బావిలో నీరు నిండుగా ఉంది. ప్రధాన రహదారి అంచుకు అయిదారడుగుల దూరంలోనే ఇలా ఆపద పొంచి ఉన్నా.. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. ప్రమాదం జరిగిన తరువాత హడావుడి చేసే కన్నా.. ముందస్తుగానే ఇక్కడ ప్రహరీని నిర్మించడంతోపాటు సూచిక బోర్డు పెట్టాలని సమీప గ్రామాల ప్రజలు విన్నవించినా ఆ దిశగా చర్యలు కనిపించలేదు. దీంతో దినదినగండమనేలా ఈ మార్గంలో వాహనదారులు ముందుకెళ్తున్నారు.

# పట్టపగలే.. ఇసుక చోరులు




ఖానాపూర్:ధనార్జనే ధ్యేయంగా గోదావరి నుంచి ఇసుకను తరలించుకుపోతున్నారు. ఉత్తర వాహిణీ గౌతమి గోదావరి నది వానాకాలం మూడు నెలల పాటు భారీ ప్రవాహంతో పారింది. ఎక్కడికక్కడ ఇసుక మేటలు వేశాయి. ఇటీవల నీటి ప్రవాహం తగ్గడంతో ఇసుక వ్యాపారుల కన్నుపడింది. తీరం నుంచి ఇసుక పొరుగుజిల్లాకు తరలిపోతోంది. ఖానాపూర్ శివారు గోదావరి నదిలో నుంచి బాదనకుర్తి వైపు ఇసుకను తరలిస్తున్నారు. గోదావరిలో ఏకంగా జేసీబీలను పెట్టి ఇసుకను ట్రాక్టర్లలో నింపుకెళ్తున్నారు. వందలాది ట్రాక్టర్ల ఇసుక గోదావరి నుంచి బాదనకుర్తి మీదుగా తరలిపోతోంది. పట్టపగలే జేసీబీలతో ఇసుక తరలించుకుపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖానాపూర్ మండలంలో ఎర్వచింతల్ నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఖానాపూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పెద్దఎత్తున ఇండ్లు, వ్యాపార నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారులు దొడ్డిదారిన సత్తనపల్లి దిలావర్‌పూర్ మీదుగా, బొడ్డోనికుంట, కప్పలకుంట కట్టపై నుంచి అధికారుల కన్నుగప్పి ఇసుకను ఖానాపూర్‌కు తరలించుకొని వచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పోలీసులు, అటవీ అధికారుల తనిఖీల్లో అడపాదడపా ఇసుక ట్రాక్టర్లు, లారీలు పట్టుబడుతున్నా వారు లెక్కచేయడం లేదు. సత్తనపల్లిలో ఇటీవల అటవీ అధికారులు ఓ లారీని పట్టుకొని కేసు నమోదు చేశారు. అయినా అనుమతులు లేకుండానే ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అధికారులు స్పందించి అక్రమ ఇసుక తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# 'గిరి' పిల్లలకు 'లఘు'శిక్షణ





ఇచ్చోడ:నాకు వచ్చిన విద్యతో రాణించాలి, నా కుటుంబానికి ఆసరాగా నిలవాలి, సంపాదనపై దృష్టి పెట్టాలనే ఆశ ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. కానీ తను నేర్చుకున్న విద్యను మరికొందరికి పంచి వారిలోనూ కొత్త ఆలోచనలను తీసుకురావాలనే ఆలోచన మాత్రం చాలా అరుదుగా ఉంటుంది. అలా తను పొందిన విద్యను చిన్నారులకు అందించి ప్రయోజకులను చేయాలని సంకల్పించారు.. హైదరాబాద్‌కు చెందిన లావణ్య. టెలివిజన్ రంగంపై శిక్షణ పొంది, జిల్లాలోని గిరిజన బాలలకు అందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో 15 రోజులుగా ఉచిత శిక్షణ అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన లావణ్య ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఇండియా–పుణేలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. తండ్రి ఎన్.సీతారామశాస్త్రి విశ్రాంత సైనికుడు, తల్లి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యుల తోడ్పాటుతో తనవంతుగా పేద విద్యార్థులకు ఈ రంగంపై దృష్టి సారించేలా చూడాలని సంకల్పించారు. గురుకులాల ఓఎస్‌డీ శ్రీనివాస కుమార్‌ను కలిసి విషయం చెప్ప డంతో.. అంగీకరించారు. దీంతో 15 రోజులుగా ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గిరిజన పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో షార్ట్ ఫిల్మ్, షార్ట్ డివిజన్, ఎడిటింగ్, కెమెరా, స్టోరీ ఐడియా, నటన తదితర అంశాలపై వివరిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆయా మెలకువలు పాటిస్తూ పలు లఘుచిత్రాలు సైతం తీస్తున్నారు. గిరిజన గ్రామాలకు చెందిన వారికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పాటునిస్తాయి. చరవాణుల్లో వచ్చే లఘు చిత్రాలను చూసి ఎలా తీస్తారో అనుకునే వాళ్లం. కానీ మాకు కళ్లముందే వాటిని చేయిస్తూ, అవగాహన కల్పించడంతో చాలా వరకు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలిగింది. దీంతోపాటు నటన విషయంలోనూ అనేక మెలకువలు ఇచ్చారు. భవిష్యత్తులో ఈ రంగాల్లో రాణించేందుకు అవకాశం ఏర్పడింది.

# చివరి ఆయకట్టుకు అందని నీరు



పెద్దపల్లి, ఈ యాసంగిలో ఎక్కువ మంది రైతులు వరిసాగు వైపు మక్కువ చూపారు. జిల్లాలో డీ–83 కింద ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల పరిధిలో 1,25,000 ఎకరాలు, డీ–86 కింద జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల పరిధిలో 70 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నీరు సరఫరా చేస్తున్నారు. ఈ యాసంగిలో మొత్తం 2,10,678 ఎకరాల్లో సాగు చేపట్టారు. వరి సాగు విస్తీర్ణం 1,62,004 ఎకరాల అంచనా ఉండగా.. అంతకుమించి మరో 37,447 ఎకరాల్లో వరి సాగు కావడం గమనార్హం. పెద్దపల్లి జిల్లా ఆయకట్టుకు ఎస్సారెస్పీ నుంచి డీ–83, డీ–86ల ద్వారా సాగునీటి సరఫరా సరిపోవడం లేదు. చివరి ఆయకట్టుకు సాగునీటి సమస్యను దూరం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వరద కాలువగుండా ఎస్సారెస్పీకి తరలించి ఆయకట్టు భూములకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం పునరుజ్జీవ పథకాన్ని చేపట్టింది. ఆయకట్టును స్థిరీకరించి వరద కాలువ నుంచి కాకతీయ ప్రధాన కాలువ వరకు ఓ కాలువను తవ్వి, దాని ద్వారా నీటిని తరలించాలని సంకల్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని లక్ష్మీపూర్ సొరంగ పంప్‌హౌస్‌ల ద్వారా వరద కాలువగుండా మధ్యమానేరుకు తరలించే పనులు ఇటీవలే పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభోత్సవం జరగకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వరద కాలువ 88వ కిలోమీటర్ వద్ద నుంచి కాకతీయ ప్రధాన కాలువ 96 కిలోమీటర్ వరకు కాలువ తవ్వి డీ–83, డీ–86 కాలువలకు కాళేశ్వరం నీళ్లను మధ్యమానేరు కంటే ముందుగానే ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం వారబందీ పద్ధతిలో 8 రోజులు ఆన్, 7 రోజు ఆఫ్ క్రమంలో 2,500 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. ఇదే కాలువ ప్రారంభోత్సవం పూర్తయితే ఏకంగా 3,500 క్యూసెక్కుల వరకు నిరంతరం నీటి తడులు అందించేందుకు అవకాశాలుంటాయి.

# నిలిచిన పనులు.. అవస్థలు మొదలు



ఆసిఫాబాద్ :జిల్లా కేంద్రంలో డీఎంఎఫ్‌టీ నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను నిధుల కొరత వెంటాడుతోంది. అవి మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేసవిలో పనులు పూర్తి చేయకుంటే వచ్చే వానాకాలంలో మళ్లీ పాత సమస్యలు పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ప్రాధాన్యం లేని ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టి.. తీరా బిల్లులు రావడంలేదంటూ అవసరమైన చోట్ల పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. జిల్లా ఆవిర్భావం తర్వాత ఆసిఫాబాద్ క్రమంగా అభివృద్ధి చెందుతోంది. కొత్త కాలనీలు ఏర్పడి పట్టణం విస్తరణ పెరిగింది. చాలా కాలనీల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిచోట్ల పాత కాలువలు ధ్వంసమై మురుగునీరు ముందుకు పారలేక రోడ్డుపై చేరుతోంది. జిల్లా కేంద్రంలో కంఠ, పైకాజీనగర్, హడ్కోకాలనీ, జూబ్లీమార్కెట్, జిల్లా కేంద్రంలోని ప్రధాన హైవే రోడ్డు తదితర ప్రాంతాలు వరదనీటితో రెండేళ్ల క్రితం జలమయం అయ్యాయి. ఆ కాలనీల మీదుగా వెళ్లే ప్రధాన కాలువను మధ్య మధ్యలో కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో కాలువ కుచించుకుపోయి.. ఏటా వానాకాలం వచ్చిందంటే వరద పోటుకు మురుగు ఇళ్లలోకి నీరు చేరేది. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం 2021లో అప్పటి పాలనాధికారి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు ప్రత్యేక చొరవతో రూ. 12 కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో పనులు జరుగుతున్నాయి. కొన్ని పనులు కాగానే బిల్లులు రావడంలేదంటూ గుత్తేదారులు చేతులెత్తేశారు. దీంతో మిగతా పనులు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రంలో బజార్‌వాడి షాదీఖానా నుంచి కంఠ, హడ్కో, పైకాజీనగర్‌ల మీదుగా జూబ్లీమార్కెట్ వరకు కాలువ నిర్మాణం కోసం రూ.రెండు కోట్లు కేటాయించారు. గతేడాది మే నెలలో నిర్మాణ పనులు ప్రారంభించారు. సగం వరకు కాలువ నిర్మించారు. దీంతోపాటు మరో నాలుగు చోట్ల కాలువలు నిర్మించారు. మొత్తం రూ. 2.40 కోట్ల పని చేయగా.. రూ.కోటి మాత్రమే బిల్లు చెల్లించారు. దీంతో మిగతా పనులను పూర్తి చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడంలేదు. పైకాజీనగర్‌లో రోడ్డు తవ్వి కాలువ నిర్మించారు. దానిపై స్లాబు నిర్మించకుండా పనులు మధ్యలో ఆగిపోయి ఇళ్లకు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. జిల్లా కేంద్రంలో మొత్తం 172 పనులకోసం రూ. 12 కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారు. వాటిలో వివిధ కాలనీల్లో కాలువల నిర్మాణం కోసం 71 పనులకు సంబంధించి రూ. 7.20 కోట్లు కేటాయించారు. 15 పనులు పూర్తి కాగా రూ.కోటి బిల్లు చెల్లించారు. మిగతా పనులు నిలిచిపోయాయి. అంతర్గత రోడ్లకు సంబంధించి 68 పనులకు రూ. 2.95 కోట్లు కేటాయించారు. 22 పనులు పూర్తయ్యాయి. ఇతర ఎనిమిది పనులకు రూ. 85 లక్షలు కేటాయించారు. వాటిలో ఆరు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వేసవిలోనే పనులు పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# బల్దియాలో బదిలీల పరంపర..



నిర్మల్ :కొద్దినెలలుగా నిర్మల్ మున్సిపల్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు స్థానికంగా చర్చనీ యాంశమవుతున్నాయి. నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు, ప్రతిపక్ష పార్టీల ఆందోళనలతో రాష్ట్రవ్యాప్తంగా అభాసుపాలైంది. దీనికితోడు వరుసగా పుర కమిషనర్లు బదిలీ అవుతుండటం మరిన్ని విమర్శలకు తావిస్తోంది. అంతర్గతంగా అసలేం జరుగుతుంది, అనంతరం సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆయన కొద్దినెలలు పనిచేసిన అనంతరం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కొద్దిరోజులు భైంసా ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు చూసినప్పటికీ ఆ తర్వాత సంపత్‌కుమార్‌ను నియమించారు.ఈ పరిస్థితి ఎందుకు నెలకొందనే సందేహాలు తలెత్తుతున్నాయి. సాధారణంగా ప్రభుత్వశాఖల్లో పనిచేసే అధికారులు కనీసం రెండు లేదా మూడేళ్లు ఒకేచోట పనిచేయడం పరిపాటి. ఏదో అనుకోని సంఘటన, అత్యవసర పరిస్థితి ఎదురైతే మినహా ఇందులో పెద్దగా మార్పు కనిపించదు. కానీ, నిర్మల్ పురపాలక సంఘం మాత్రం గత కొన్నేళ్లుగా తీవ్ర విమర్శలను మూటగట్టుకుంటోంది. గడిచిన మూడేళ్లలో ఇప్పటికే ముగ్గురు పుర కమిషనర్లు బదిలీ కావడం దీనికి కారణం. గతంలో పనిచేసిన బాలకృష్ణ రెండేళ్ల కాలం పూర్తికాకముందే మంచిర్యాలకు బదిలీపై వెళ్లిపోయారు. అంతర్గత ఒత్తిళ్ల కారణంగానే ఈ బదిలీ జరిగిందనే ఆరోపణలు వినిపించాయి. ఆ తర్వాత కొద్దిరోజులు ఇన్‌ఛార్జి పాలన కొనసాగింది. అనంతరం సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. అనంతరం సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆయన కొద్దినెలలు పనిచేసిన అనంతరం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కొద్దిరోజులు భైంసా ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు చూసినప్పటికీ ఆ తర్వాత సంపత్‌కుమార్‌ను నియమించారు. ఆయన కొద్దినెలలు పనిచేసిన అనంతరం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కొద్దిరోజులు భైంసా ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు చూసినప్పటికీ ఆ తర్వాత సంపత్‌కుమార్‌ను నియమించారు. ఈయన గత సంవత్సరం మే నెలలో బాధ్యతలు స్వీకరించారు. ఇంకా ఏడాది కూడా గడవకముందే ఆయననూ బదిలీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంటే.. మూడేళ్ల కాలంలో ముగ్గురు బదిలీ అయ్యారన్నమాట. వచ్చిన అధికారులంతా ఉద్యోగ బాధ్యతల పరంగా పూర్తిగా స్థిరపడకముందే బదిలీపై వెళ్లిపోతుండటం అందరినీ కలవరానికి గురిచేస్తోంది.

# నిధులు పుష్కలం.. అనుమతులే ఆలస్యం



వేమనపల్లి, :పల్లెలను పట్టణాలకు అనుసంధానించి వాటిని పురోభివృద్ధి బాట పట్టించేందుకు ప్రభుత్వం మెరుగైన రహదారుల నిర్మాణాల కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోంది. అటవీ అనుమతులు రాకపోవడంతో జాప్యం జరుగుతోంది. జిల్లా సరిహద్దులోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో రవాణా సదుపాయం లేదు. జిల్లాలో మారుమూల కోటపల్లి, వేమనపల్లి, నెన్నెలతో పాటు బెల్లంపల్లి మండలాల్లో అటవీ అనుమతులు లేక రహదారి పనులు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటపల్లి మండలంలోని మారుమూల కొత్తపల్లి, నక్కలపల్లి, పంగిడిసోమారం, వెంచపల్లితో పాటు వేమనపల్లి మండలం రాచర్ల, లక్ష్మీపూర్, బద్దెంపల్లి, చామనపల్లి, నాగారం తదితర గ్రామాలకు సరైన రహదారులు లేవు. ఆపద వేళల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. నెన్నెల మండలం మన్నెగూడెం – కోనంపేట్ మధ్య 2019–20 సంవత్సరంలో పంచాయతీరాజ్ నిధులు రూ. 90 లక్షలతో చేపట్టిన పనులు అనుమతులులేని కారణంగా నిలిచిపోయాయి. సుమారు 3 కిలోమీటర్ల మేర అనుమతులు లభిస్తే ఈ గ్రామాల మధ్య మెరుగైన రహదారి ఏర్పడుతుంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**